క్లుప్తంగా

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి


గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యాధికారి వనజ, గైనకాలజిస్టు ప్రియాంక

దేవరాపల్లి: గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వైద్యాధికారి డి. వనజ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ యోజనలో భాగంగా గర్భిణులను ఆమెతోపాటు గైనకాలజిస్టు ఎస్. ప్రియాంక పరీక్షించారు. బీపీ, రక్త పరీక్షలతోపాటు బరువు తదితర తనిఖీలు చేశారు. హై రిస్క్ కేసులతోపాటు స్కానింగ్ అవసరమైన గర్భిణులను కె.కోటపాడు కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా గర్భిణులు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడంతోపాటు ప్రశాంత వాతావరణంలో తగినంత విశ్రాంతి తీసుకోవాలని పలు జాగ్రత్తలు సూచించారు.

వ్యాధినిరోధకశక్తి పెంపునకు టీకాలు


వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న వైద్యాధికారి సుబ్రహ్మణ్యం

కె.కోటపాడు: ఐదేళ్లలోపు చిన్నారులకు టీకాలు వేయడం వల్ల వ్యాధులను సమర్థంగా ఎదుర్కొనే శక్తి సమకూరుతుందని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం ఎ.భీమవరంలో చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదేళ్ల లోపు చిన్నారులు 11 మందికి, ధనుర్వాతం బారిన పడకుండా ఆరుగురు గర్భిణులకు టీకాలు వేసారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, ఎ.ఎన్.ఎం దేవి, ఆశా కార్యకర్త అరుణ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు రేపు

దేవరాపల్లి: ఎ. కొత్తపల్లి పంచాయతీ శివారు పందూరుపాలెంలో అభయాంజనేయ స్వామి తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు, రూ.1500, రూ.వెయ్యి చొప్పున బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆరోజు ఉదయం నుంచి స్వామి వారికికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సాయంత్రం మహిళల కోలాట ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

12 నుంచి కేజీబీవీలో దరఖాస్తుల స్వీకరణ

మాడుగుల: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశాలకు ఈ నెల 12వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6, 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్లు భర్తీ కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అనాథులు, బడి మానేసిన పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

క్రైస్తవుల పశ్చాత్తాప పాదయాత్ర


యాత్రలో పాల్గొన్న దైవజనులు

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధి పెదబొడ్డేపల్లి ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో చేపట్టిన పాప పశ్చాత్తాప పాదయాత్రలో అధిక సంఖ్యలో దైవజనులు పాల్గొన్నారు. చర్చి ఫాదర్ సౌరీబాబు ప్రత్యేక ప్రార్థనలు చేసి యాత్రను ప్రారంభించారు. ప్రతి సంవత్సరం గుడ్ ఫ్రైడే ముందు శ్రమ దినాల్లో ఈ యాత్ర నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. ఈ యాత్ర ఆర్సీఎం చర్చి నుంచి గొలుగొండ మండలం పాకలపాడులో మేరీ లూర్థ మాత దేవాలయం వరకు కొనసాగింది. ఈ యాత్రలో పాల్గొనటం ద్వారా దేవుని ఆశీస్సులు మెండుగా ఉంటాయని దైవజనులు విశ్వాసం వ్యక్తం చేశారు.

పుణ్యస్నానం.. పులకించి..


చోడవరం: ముద్దుర్తి సంగమేశ్వరుని ఆలయం వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు


రోలుగుంట జీవకారుణ్యం వద్ద భజనలతో జాగారం చేస్తున్న భక్తులు


చోడవరం: కూచిపూడి నృత్య బృందంతో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ


గొలుగొండ: ధారమఠం ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు


మాడుగుల రూరల్: కె.జె.పురం శివాలయంలో మహన్యాస రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు

పవిత్రమైన పుణ్యస్నానాలకు భక్తులు పోటెత్తారు. వీరంతా జాగారం చేసి వేకువజాము నుంచే నదుల్లో స్నానాలాచరించి శివాలయాల్లో పూజలు చేశారు. వీరికి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పలుచోట్ల అన్న సమారాధనలు నిర్వహించారు.

- జాగరణ చేసిన భక్తులు
- స్నానఘట్టాలకు పోటెత్తిన వైనం
- కోలాహలంగా ఉత్తరవాహిని


మాడుగుల రూరల్: ఎం.కోడూరు శివాలయంలో రుద్రాభిషేకంలో పూజలు చేస్తున్న భక్తులు

నర్సీపట్నం: బలిఘట్టం బ్రహ్మలింగేశ్వరస్వామిని దర్శించుకునేందుకు శనివారం భక్తులు పోటెత్తారు. ధారమఠం, కల్యాణపు లోవలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు జాగారం చేసి తెల్లవారుజామున బలిఘట్టం తరలివచ్చి ఉత్తరవాహినిలో స్నానాలు ఆచరించారు. బ్రహ్మలింగేశ్వరస్వామికి పూజలు చేశారు. పాకలపాడు గురుదేవుల ఆశ్రమ, ఆలయం కోలాహలంగా మారింది. అర్చకులు బ్రహ్మముడులు వేసి ఆశీర్వచనాలు అందించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు ఆశ్రమ నిర్వాహకులు అల్పాహారంతోపాటు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్నానాల ఘాట్లు, పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ కవర్లు తీసుకురాకుండా మున్సిపల్ కమిషనర్ రవిబాబు పటిష్ట చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పట్టణ పోలీసులు చర్యలు చేపట్టారు.

చోడవరం: ప్రఖ్యాతిగాంచిన ముద్దుర్తి సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద శారదా నదిలో శనివారం తెల్లవారుజామున పుణ్యస్నానాలు ఆచరించారు. ఇక్కడ పెద్దేరు, బొడ్డేరు, శారదానదుల సంగమం ఒడ్డున అతి పురాతన దేవాలయంలో కొలువైన సంగమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. గౌరీపట్నం వద్ద పెద్దేరు నది మార్కమ్మ రేవు వద్ద, జుత్తాడ, గోవాడ,


మాడుగుల రూరల్: కె.జె.పురం శివాలయంలో క్లారినెట్ కళాకారుడిని సన్మానిస్తున్న దృశ్యం

గవరవరం, బెన్నవోలు, గోవాడ గ్రామాల శారదానది, పెద్దేరు రేవుల్లో పుణ్యస్నానాలు చేశారు. చోడవరం స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి లింగోద్భవకాలంలో వేలాది మంది భక్తులు రావడంతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా చిన్నారుల కూచిపూడి, భరతనాట్యం బృందం ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడు పప్పల జయదేవ్, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, కమిటీ చైర్మన్ గూనూరు సత్తిబాబు పర్యవేక్షణలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మాకవరపాలెం: శివరాత్రి ఉత్సవాలు ముగిశాయి. మండలంలోని పెద్దమిల్లు జంక్షన్‌లోని వామలింగేశ్వర, గిడుతూరు గంగాధరేశ్వర, పి.పి.అగ్రహారంలోని అమృతేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. జాగారం భక్తులంతా తెల్లవారు జాము నుంచి శైవక్షేత్రాలను సందర్శించారు.

మాడుగుల రూరల్: కె.జె.పురం ఉమా భీమలింగేశ్వరస్వామి ఆలయంలో రాత్రి 10 నుంచి 2 గంటల వరకు మహన్యాస రుద్రాభిషేకంలో 8 జంటలు పాల్గొన్నాయి. ఏకాహంలో ఆకట్టుకున్న క్లారినెట్ కళాకారుడు పేలూరి వెంకట నారాయణరావును గౌరీపరమేశ్వర భజన సేన ఆధ్వర్యంలో సన్మానించారు. ఎం. కోడూరు, వీరవల్లి అగ్రహారం, తదితర ఆలయాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

దేవరాపల్లి: తిమిరాం ఉమామహేశ్వరి స్వామి ఆలయంలో అర్ధరాత్రి లింగోద్భావకాల సమయంలో భక్తులు పోటెత్తారు. గ్రామంతోపాటు మామిడిపల్లి, కలిగొట్ల, వాకపల్లి, తారువ, తదితర గ్రామాల


దేవరాపల్లి: తిమిరాం శివాలయ పూజల్లో పాల్గొన్న భక్తజనం


రావికమతం: ఆకట్టుకున్న తోటకూరపాలెం భజన మండలి సభ్యుల కీర్తనలు

భక్తులు పాల్గొన్నారు. ముందుగా స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరించారు.

రోలుగుంట: మహా శివరాత్రి సందర్భంగా రోలుగుంటలో త్రివేణి యువజన సంఘం ఆవరణలో ఆదారి గణేష్ పాత్రో సంఘ సభ్యులు, సిద్ధి వినాయక సంఘం సభ్యులతో కలిసి జాగరణ ఏర్పాటు చేశారు. భక్తులు జాగారం చేసి తెల్లవారుజామున పుణ్యస్నానాలాచరించి శివుడిని దర్శించుకున్నారు. బుచ్చింపేట మినీ కైలాసగిరిలో భక్తులకు ఇక్కడ కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు. కుసుర్లపూడి పంతులబాబు ఆశ్రమం వద్ద భజన పోటీలు నిర్వహించారు.

నాతవరం: సిద్ధిపట్నం, మర్రిపాలెం, చమ్మచింత, సరుగుడు శివాలయాల ఆవరణలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. చమ్మచింత శివాలయం ఎదురుగా ఉత్తరవాహిని తాండవ నదీలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. నాతవరం, కొయ్యూరు మండలాల నుంచి తరలివచ్చారు.

గొలుగొండ: ధారమఠం శివాలయానికి పెద్ద ఎత్తున భక్తులు రావడంతో శివనామస్మరణతో ఈ ప్రాంతం


మాకవరపాలెం: వామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


దేవరాపల్లి: ప్రత్యేక అలంకరణలో ఉమామహేశ్వరి స్వామి


రోలుగుంట: బుచ్చింపేట మినీ కైలాసగిరి వద్ద పార్వతీ పరమేశ్వరులకు భక్తుల పూజలు


రోలుగుంట: ధర్మసాగరం బృందం భజన


రావికమతం: కల్యాపులోవలో అన్నసమారాధనలో యాత్రీకులు

మార్మోగింది. శుక్రవారం రాత్రి రుద్రాభిషేకం చేశారు. గొలుగొండలో వీరభద్రస్వామి ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఏఎల్ పురం నీలకంఠేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.


నాతవరం: చమ్మచింతలో తాండవ నదీలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు


నాతవరం: సిద్ధిపట్నం శివాలయంలో అన్నదానం చేస్తున్న అర్చక దంపతులు


నర్సీపట్నం: ఉత్తరవాహినిలో బ్రహ్మకుమారీస్ ఏర్పాటు చేసిన శివలింగం


నర్సీపట్నం: బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయం వద్ద


గొలుగొండ వీరభద్రస్వామి ఆలయం వద్ద అన్నసమారాధన

టీడీపీని గెలిపిస్తే అవినీతి పాలన

• జెడ్పీటీసీ దొండా రాంబాబు

బుచ్చెయ్యపేట: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటేనే రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు యథావిధిగా అందుతాయని జెడ్పీటీసీ దొండా రాంబాబు తెలిపారు. శనివారం సాయంత్రం లోపూడిలో నేను సిద్ధం.. నా బూత్ సిద్ధం సమావేశం జరిగింది. లోపూడి, బంగారుమెట్ట, ఎల్.బి.పురం, శింగవరం గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు పాల్గొన్నారు. వీరినుద్దేశించి జెడ్పీటీసీ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పాలనలో అంతా అవినీతితోపాటు దోపిడీయే రాజ్యమేలిందన్నారు. జగనన్న గద్దె నెక్కిన తర్వాత అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. మరలా జగనన్న గెలవకపోతే సంక్షేమ పథకాలతోపాటు వలంటీరు, సచివాలయ వ్యవస్థను తప్పించి మరలా అవినీతి పాలనను టీడీపీ నాయకులు తెస్తారన్నారు. రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పి ఎమ్మెల్యేగా కరణం ధర్మశ్రీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, సర్పంచ్‌లు మేరుగు కుమారి బాబూరావు, తమరాన శ్రీను, సచివాలయ కన్వీనర్లు యెనుముల వాసు, తమరాన రమణ, నాయకులు అప్పలనాయుడు, గుద్దేటి శ్రీను, గుడాల ఆనంద్, వెంకటప్పారావు, సత్తిబాబు, చప్పా దుర్గా గణేష్ పాల్గొన్నారు.


లోపూడిలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ దొండా రాంబాబు

ఇంటి రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ

చీడికాడ: చీడికాడ, తురువోలు గ్రామాల్లో లబ్ధిదారులకు ఇంటి రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ చేశారు. తురువోలులో 51 మందికి సర్పంచ్ మట్టా అప్పారావు, ఉప సర్పంచ్ పి.టి.బాబు అందించగా, చీడికాడ సచివాలయంలో 61 మందికి వీఆర్వో సలుగు సత్యనారాయణ పట్టాలందించారు. వైఎస్సార్‌సీపీ నేతలు పరువాడ మహేష్, బలిజి దేముళ్లు, చొక్కాకుల వెంకునాయుడు పాల్గొన్నారు.

బ్రిటిష్ సమాధుల స్థలంలో ఆక్రమణలు

తొలగించాలని పన్నుల చెల్లింపుదారుల సంఘం డిమాండ్

నర్సీపట్నం: పట్టణం నడిబొడ్డున బ్రిటిష్ సైనికాధికారుల సమాధుల స్థలంలో ఆక్రమణల తొలగింపు చర్యలు తీసుకోవాలని ఆస్తి పన్ను చెల్లింపుదారుల సంఘం కార్యదర్శి కె.శివనారాయణరాజు డిమాండ్ చేశారు. బ్రిటిష్ సైనికాధిరులు హైటర్, కవర్డుల సమాధుల ప్రాంతం రాను రాను ఆక్రమణలకు గురవుతుందని వాపోయారు. ఈ నెల 7న కొంతమంది ఓ బడ్డీకొట్టు ఏర్పాటు చేశారన్నారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు తక్షణమే ఆక్రమణల తొలగింపు చర్యలు తీసుకోవాలని కోరారు. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా మన్యం పితూరీ నడిపిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాటపటిమకి చిహ్నంగా ఈ సమాధులు నిలుస్తున్నాయన్నారు. భావితరాలకు తెలియాలంటే వీటిని పరిరక్షించాలన్నారు.

యాదవుల స్థల సమస్య పరిష్కరిస్తాం

చోడవరం: నర్సాపురంలో యాదవుల స్థల సమస్యను పరిష్కరిస్తామని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు తెలిపారు. ఇక్కడ పశువుల పాకలు వేసుకోవడానికి స్థలాన్ని సమకూర్చడంలో నెలకొన్న వివాదంపై యాదవ సంఘం నాయకులు, గ్రామ పెద్దలు, బాధితులతో శనివారం సమావేశం నిర్వహించారు. యాదవుల సంక్షేమానికి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పూర్తిగా కృషి చేస్తున్నారని వెంకట్రావు చెప్పారు. సమావేశంలో జిల్లా యాదవ సంక్షేమ సంఘం నాయకుడు, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు, జిల్లా గొర్రెలు, మేకల సహకార సంఘం చైర్మన్ గంటా శ్రీరామ్, జిల్లా యాదవ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సత్యశ్రీనివాస్, చోడవరం నియోజకవర్గం అధ్యక్షుడు మొల్లి ప్రసాద్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు మొల్లి సోమునాయుడు, సర్పంచ్ దొడ్డి అప్పారావు, మాజీ సర్పంచ్‌లు దొడ్డి హనుమంతు, దొడ్డి సన్యాసిరావు పాల్గొన్నారు.


సమస్యపై చర్చిస్తున్న యాదవ సంఘం జిల్లా నాయకులు, గ్రామస్తులు

రైతులంతా తరలి రావాలి

మాడుగుల రూరల్: పెద్దేరు జలాశయం ఆధునీకీకరణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి రైతులంతా పెద్ద ఎత్తున తరలి రావాలని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ శనివారం ప్రకటనలో కోరారు. ఎల్.పొన్నవోలు పంచాయతీ శివారు ఎల్.కె గదబ వీధి వద్ద ఆదివారం ఉదయం 10 గంటలకు పెద్దేరు 4ఎల్ కాలువ శంకుస్థాపన, 10.30 గంటలకు పొన్నవోలు పంచాయతీ శివారు ఓంటిమామిడిపాలెంలో మంచినీటి ట్యాంకును ప్రారంభిస్తారన్నారు. జె.డి.పేట సమీపంలో జాలంపల్లి జంక్షన్ వద్ద పెద్దేరు జలాశయం ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన, కింతలి వల్లాపురంలో మంచినీటి ట్యాంకుతోపాటు వి.జె.పురంలో అంగన్‌వాడీ పక్కా భవనాన్ని డిప్యూటీ సీఎం బూడి ప్రారంభిస్తారన్నారు.

120 మందికి హోమియో వైద్య సేవలు


పరీక్షలు చేస్తున్న హోమియో వైద్యాధికారి

మాడుగుల రూరల్: ఎం. కోడూరు శివాలయం వద్ద ఉచిత హోమియో మెగా వైద్య శిబిరాన్ని సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు శనివారం ప్రారంభించారు. హోమియో వైద్యాధికారి వెంకటేశ్వరావు, సిబ్బంది సారథ్యంలో 120 మందికి బీపీ, సుగర్, తదితర దీర్ఘకాలిక రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ చింతా వెంకటరమణమూర్తి, పడాల అప్పలనర్సయ్య, రాయపురెడి కొండలరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌పై టీడీపీ కోవర్టుల దుష్ప్రచారం

చర్యలు తీసుకోవాలని యాదవ నేతల డిమాండ్

బుచ్చెయ్యపేట: ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీపై తప్పుడు ప్రచారాలు చేస్తున్న టీడీపీ కోవర్టులపై తగు చర్యలు తీసుకోవాలని చోడవరం, బుచ్చెయ్యపేట మండల యాదవ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సీతయ్యపేటలో రెండు మండలాలకు చెందిన యాదవ సంఘం నాయకులు, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నరసింగరావు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు మెల్లి సోమునాయుడు, వైఎస్సార్‌సీపీ బుచ్చెయ్యపేట మండల మాజీ అధ్యక్షుడు జోగా కొండబాబు, మల్లాం సర్పంచ్ బర్ల శివ, పీడీ పాలెం ఉప సర్పంచ్ గుద్దేటి శ్రీను నాయకులు ముసలి నాయుడు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేపీ అగ్రహారం ఎంపీటీసీ దేవర అప్పారావు తమ పార్టీలో ఉంటూ ప్రభుత్వ విప్ ధర్మశ్రీపై తప్పుడు ఆరోపణలు చేయడాన్ని ఖండించారు. పార్టీ, కులం చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించడమే కాక నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న విప్ ధర్మశ్రీపై కుల రాజకీయాలు చేయడం తగదన్నారు. చోడవరం మండలం నరసాపురంలో అర్హులైన యాదవులకు ఇంటి పట్టాలు ఇచ్చారన్నారు. కొంతమంది యాదవులతో తప్పుడు ప్రచారాలు చేయిస్తూ కులానికి చెడ్డ పేరు తెస్తున్నాడన్నారు. టీడీపీకి కోవర్టుగా పనిచేస్తున్న ఎంపీటీసీ అప్పారావు పద్ధతి మార్చుకోకపోతే పార్టీ నుంచి బహిష్కరించాలన్నారు. చోడవరం నియోజకవర్గంలో యాదవ సంఘ నాయకులంతా అతను వైఖరిని ఖండించాలన్నారు.


సీతయ్యపేటలో విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

ఆర్టీసీ కార్గో సర్వీసు వినియోగించుకోండి

చోడవరం రూరల్: ఆర్టీసీ అమలు చేస్తున్న కార్గో, పార్సిల్ సర్వీసుల్ని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ చీఫ్ మేనేజర్ (ట్రాఫిక్) బి.అప్పలనాయుడు కోరారు. శనివారం ఆయన చోడవరం, మాడుగుల ఆర్టీసీ బస్ స్టేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని కల్యాణపులోవ, అప్పికొండ, ఆర్కే బీచ్‌లకు పలు స్పెషల్ సర్వీసుల ద్వారా ప్రయాణికులకు సేవలు అందచేశామన్నారు. ప్రయాణికులు కేవలం రాకపోకలకే కాకుండా వారికి చెందిన వస్తు సామగ్రి ఇతర వస్తువులకు పార్సిల్ సర్వీసును ఉపయోగించుకోవాలన్నారు.


ఆర్టీసీ సర్వీసులను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ మేనేజర్

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సన్మానం

మాకవరపాలెం: కొండలఅగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాలలో మహిళా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు బి.వరలక్ష్మి, దమయంతితోపాటు ఆయాలను సత్కరించారు. పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మి, ఉపాధ్యాయినులు త్రివేణి, నిర్మలలను హెచ్‌ఎం త్రిమూర్తులు, సచివాలయాల మండల కన్వీనర్ చిటికెల రమణ, వైఎస్సార్‌సీపీ నేత పోలిరెడ్డి రమణ ఘనంగా సన్మానించారు.


మధ్యాహ్న భోజన నిర్వాహకులను సత్కరిస్తున్న నేతలు, ఉపాధ్యాయులు

ఘనంగా సీతారాముల తీర్థ మహోత్సవం

కె.కోటపాడు: గుల్లేపల్లిలో సీతారాముల తీర్థ మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామస్తులు, సర్పంచ్ బండారు దేముళ్లు, గ్రామ పెద్దలు సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు.